నిందితుల అరెస్ట్

వేములవాడ, జనవరి 21: పట్టణంలో ఈ నెల 15న జరిగిన దాడి కేసులో నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భగవంత రావునగర్‌లో ఈ నెల 15 న పట్టణానికి చెందిన కోగిల నాగేశ్ , గుగులోత్ రాకేశ్, ఎడవల్లి హర్షిత్, వంగల మంజునాథ్ మద్యం మత్తులో ఏసుకూరి రాజేందర్, దుర్గం శంకరయ్యపై విచక్షణా రహితంగా దాడి చేశారని తెలిపారు. ఈ క్రమంలో రాజేందర్ వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ ఈ నెల 18న మృతి చెందాడన్నారు. ఈ ఘటనలో నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించామని తెలిపారు. వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి వేళలో అనవసరంగా రోడ్లపై తిరిగే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేములవాడ, జనవరి 21: పట్టణంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈ సిద్ధార్థ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహా శివరాత్రి జాతర ముందస్తు పనుల్లో భాగంగా పట్టణంలోని భగవంత రావు నగర్, భీమేశ్వర ఆలయం ఏరియా, బద్ధి పోచమ్మ వీధి, పోలీస్‌స్టేషన్ ఏరియాలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చోరీ కేసులో మూడేండ్ల జైలు

ముస్తాబాద్, జనవరి21: చోరీ కేసులో నిందితుడికి మూడేండ్ల జైలు శిక్ష, ₹200 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ గణేశ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతేడాది మే 4న చిప్పలపల్లిలోని పెద్దమ్మ గుడిలో అమ్మవారి పుస్తె మట్టెలు చోరీకి గురికాగా, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గాడిచర్ల రామచంద్రం ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ శేఖర్‌రెడ్డి ఫాజుల్‌నగర్‌కు చెందిన శివరాత్రి సంపత్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, పీపీ సందీప్ వాదించగా కోర్టు సీఎంఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు, కానిస్టేబుల్ దేవేందర్ సాక్షులను ప్రవేశపెట్టారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

చందుర్తి, జనవరి 21: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చందుర్తి ఎస్ఐ అంజయ్య సూచించారు. మల్యాలలో మంగళవారం మీ కోసం పోలీస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూదం, గంజాయి, అక్రమ మద్యం, రోడ్డు ప్రమాదాలు, గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు.

ముస్తాబాద్, జనవరి 21: తుర్కపల్లిలో మంగళవారం పోలీసులు మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు సైబర్ నేరాలు, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి అవగాహన కల్పించారు. ఇక్కడ ఎస్ఐ గణేశ్, సిబ్బంది ఉన్నారు.

పిల్లలను బడికి పంపించాలి

ముస్తాబాద్, జనవరి 21: పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని ఎంఈవో రాజిరెడ్డి సూచించారు. బడిబయట పిల్లల సర్వేలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో ఇంటింటా తిరిగి సర్వే చేశారు. బడికి రాకుండా ఇంటి వద్ద ఉన్న పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇక్కడ హెచ్ఎం ప్రభాకర్‌రెడ్డి, సీఆర్పీ పరశురాములు, సీసీవో రాజేందర్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అల్పాహారం

గంభీరావుపేట, జనవరి 21: మండలంలోని దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మంగళవారం అల్పాహార అందించే కార్యక్రమాన్ని ప్రారంభించామని హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ప్రత్యేక తరగతుల సమయంలో విద్యార్థులు చదువుతున్నప్పుడు ఆకలితో ఉండదన్న ఉద్దేశంతో అల్పాహారం అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ పలితాలు సాధించాలని సూచించారు. ఇక్కడ టీచర్లు, విద్యార్థులు ఉన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, సిరిసిల్ల శాఖ గారు. శ్రీ రేగుల వేణుగోపాల్, S/o. చంద్రయ్య, R/o. B.Y. నగర్, సిరిసిల్ల పట్టణం మరియు మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన ఖాళీ స్థలం, ప్లాట్ నెం: 10, దీని యొక్క విస్తీర్ణం: 151 చ॥గ॥, దీని యొక్క సర్వే నెం: 204/A, తిప్పాపూర్ రెవెన్యూ గ్రామం, వేములవాడ మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో కల దానిని నాక్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తి పై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో. ఈ ప్రకటన వెలువడిన 7 దినములు లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని దృవీకరించబడును.

తేది: 21-01-2025 స్థలము: సిరిసిల్ల

ఇట్లు: Sd/- పిన్నింటి అశోక్, అడ్వకేట్,
ఇ.నెం.3-7-852/1.
వావిలాలపల్లి,కరీంనగర్ సెల్: 9849331558

కోనరావుపేట: ఊరుతండాలో గ్రామసభ సమయానికి అధికారులు హాజరుకాకపోవడంతో నిరీక్షిస్తున్న తండావాసులు

చందుర్తి: మూడపెల్లి గ్రామంలో అధికారులను ప్రశ్నిస్తున్న మాజీ ఉప్ప సర్పంచ్ దుమ్ము రమేశ్

బోయినపల్లి: రత్నంపేటలో మాట్లాడుతున్న రైతు కౌడగాని తిరుపతి

గ్రామ సభలు.. గందరగోళం

- జాబితాలో పేర్లు లేకపోవడంతో ప్రజల ఆగ్రహం
- ఎక్కడికక్కడ అధికారుల నిలదీత
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేయబోతున్న నాలుగు కొత్త పథకాల కోసం నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో గందరగోళనం నెలకొన్నది. రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, నూతన రేషన్‌కార్డుల జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవంటూ అధికారులను నిలదీశారు. అలాగే ₹2లక్షల రుణమాఫీ ఎప్పుడు చేస్తరు? రైతుభరోసా ఇంకెప్పుడు ఇస్తారంటూ.. రైతులు నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే రుణమాఫీ చేసి.. రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కోనరావుపేట: మండల కేంద్రంలోని గ్రామ సభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

కోనరావుపేట, జనవరి 21: మండల కేంద్రంతో పాటు ఊరుతండా, భూక్యారెడ్డి తండా, మర్తనపేట, సుద్దాల, మంగళ్లపల్లి, వట్టిమల్ల గ్రామాల్లో అధికారులు మొక్కుబడిగా గ్రామసభలు నిర్వహించారు. పథకాల జాబితాలో కాంగ్రెస్ నేతల పేర్లు మాత్రమే ఉన్నాయని.. మిగతా వారివి ఎందుకు లేవంటూ అధికారులను నిలదీశారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన సభలో కనీస సౌకర్యాలు కల్పించలేదని గ్రామస్తులు వాపోయారు. రైతు ఆత్మీయ భరోసా పథకంలో నిరుపేదల పేర్లు కాకుండా, భూమి ఉండి ఆర్థికంగా ఉన్న వారి పేర్లు ఉన్నాయని మండిపడ్డారు. పథకాలపై ప్రజలకు మద్దతుగా నిలిచి, మాట్లాడిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఊరుతండాలో మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించాల్సిన సభకు అధికారులు సరైన సమయానికి హాజరు కాకపోవడంతో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. ఇక అజ్మీరా తండాలో కొంత మంది అధికారులతోనే మొక్కుబడిగా గ్రామసభ నిర్వహించారు. మర్తనపేటలో రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా పథకాలపై అధికారులను ప్రజలు నిలదీశారు. అలాగే మండల కేంద్రంతోపాటు సుద్దాల, మర్తనపేటలో పోలీసుల బందోబస్తు మధ్య గ్రామ సభలను నిర్వహించారు. ప్రజలు పథకాల కోసం ప్రశ్నిస్తే వారిని వెంటనే అక్కడి నుంచి తరలించారు. అధికారులు చెప్పింది వినాలని.. లేదంటే ఇబ్బందులకు గురవుతారని హెచ్చరించారు. దీంతో పోలీసుల తీరుపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు.

తూతూమంత్రంగా..

ఇల్లంతకుంట, జనవరి 21: ప్రభుత్వ పథకాల అమలు కోసం చేపట్టిన గ్రామసభలు తూతూమంత్రంగా నిర్వహించారు. మంగళవారం ఏడు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులను మాత్రమే చెప్పగా, ఎంపికైన లబ్ధిదారుల వివరాలు మాత్రం ప్రకటించలేదు. రేషన్‌కార్డు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు సైతం వెల్లడించలేదు. ఆత్మీయ భరో సా దరఖాస్తుల మాత్రమే చదవగా, గ్రామసభ నిర్వహణపై ప్రజలు విముఖత వ్యక్తం చేశారు.

సర్వేలతో కాలయాపన..

చందుర్తి, జనవరి 21: మూడపల్లి, అనంతపల్లి, రామన్నపేట, మర్రిగడ్డ, దేవునితండా గ్రామాల్లో మంగళవారం సభలు ఏర్పాటు చేశారు. మూడపెల్లిలో మాజీ సర్పంచ్ అంజి బాబు అధికారులతో మాట్లాడుతున్న సమయంలో అధికార పార్టీ నేత జోక్యంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. సర్వేల పేరుతో కాలయాపన చేయకుండా.. స్థలం లేని లబ్ధిదారులకూ ప్రభుత్వం ఇండ్ల నిర్మాణం చేయాలని అంజిబాబు కోరారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగకపోతే తీవ్ర పరిణామాలుంటాయని మాజీ ఉప సర్పంచ్ దుమ్ము రమేశ్ హెచ్చరించారు. ఎన్గల్‌లో నూతనంగా భూమి కొనుగోలు చేసిన వారికి రైతు భరో సా జాబితాలో చేర్చాలని మాజీ ఉప సర్పంచ్ జనార్దన్ డిమాండ్ చేశారు. గ్రామస్తులు కూర్చొవడానికి ఏర్పాట్లు సరిగ్గా చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు.

అయోమయంలో లబ్ధిదారులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 21: అల్మాస్‌పూర్, కిష్టూ నాయక్‌తండా, గుంటపల్లి చెరువుతండా, నారాయణపూర్‌లో జరిగిన సభలో ప్రభుత్వ పథకాల కోసం అర్జీ పెట్టుకున్నప్పటికీ.. మంజూరు కాకపోవడంతో గ్రామస్తులు అయోమయానికి లోనయ్యారు. ఒక అల్మాస్‌పూర్‌లోనే రేషన్‌కార్డుల కోసం 150మంది అర్జీ పెట్టుకుంటే.. 116డీసీఎస్‌వో వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల కోసం 346మంది అర్జీ చేసుకోగా, 217మందికి సొంత జాగలు ఉన్నట్లు గుర్తించగా 30మందికి మాత్రమే ఇండ్లు మంజూరైనట్లు తెలుపడంతో ప్రజలు సర్కారు తీరుపై అనుమానం వ్యక్తం చేశారు.

రుణమాఫీ ఎప్పుడు చేస్తరు?

బోయినపల్లి, జనవరి 21: దేశాయిపల్లి, దుండ్రపల్లి, గుండన్నపల్లి, కొత్తపేట, మర్లపేట, రామన్నపేట, రత్నంపేట గ్రామాల్లో గ్రామ సభలు జరిగాయి. తమకు రూ.2లక్షల రుణమాఫీ కాలేదని, రైతు భరోసా ఇంకెప్పుడు ఇస్తారని రత్నంపేటలో జరిగిన సభలో ఇద్దరు రైతులు అధికారులను ప్రశ్నించారు. తమకు రుణమాఫీ కాకపోవడంతో వ్యవసాయ రుణం చెల్లించలేదని, ఈ క్రమంలో తనకు గతంలో మంజూరైన లోన్‌ను సదరు బ్యాంకు ఇవ్వడం లేదని బాధిత రైతు కౌడగాని తిరుపతి వాపోయాడు. మేడిపల్లి సత్యం ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఇప్పటి వరకు తమ గ్రామానికి రాలేదని మండిపడ్డారు.

సంకెపల్లిలో సంబిగ్ధం

వేములవాడ రూరల్, జనవరి 21: వేములవాడ, వేములవాడ రూరల్ మండలాల్లోని ఆరెపల్లి, సంకెపల్లి, అనుపురం, తుర్కాశీనగర్, అచ్చనపల్లి, బొల్లారం, ఫాజుల్‌నగర్, లింగంపల్లి, బాలరాజుపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. సంకెపల్లిలో జరిగిన సభలో లబ్ధిదారుల ఎంపికలో సందిగ్ధం నెలకొన్నది. తమ పేర్లు జాబితాలో లేవంటూ గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు.

లిస్టులో మా పేర్లు ఏవీ?

ముస్తాబాద్, జనవరి 22: మొర్రాపూర్, సేవాలాల్‌తండా, రామలక్ష్మణులపల్లె, చీకోడు, చిప్పలపల్లి, రామిరెడ్డిపల్లెలో సభలు నిర్వహించారు. రుణమాఫీ, పథకాల లిస్టులో పేర్లు లేకపోవడంతో పలువురు ప్రజలు అధికారులను నిలదీశారు. తన తల్లి ఎల్లవ్వ పేరిట బ్యాంకులో పంట రుణం రూ.50వేలు తీసుకోగా, తమకెందుకు రుణమాఫీ కాలేదని చీకోడులోలో కాంపెల్లి అశోక్ ఆవేదన వ్యక్తం చేశాడు.

13మందికే రేషన్‌కార్డులా?

రుద్రంగి, జనవరి 21: గైదిగుట్టతండా, వీరుని తండాలో గ్రామసభలు నిర్వహించారు. గైదిగుట్ట తండాలో కొత్త రేషన్‌కార్డుల కోసం 80మంది దరఖాస్తు చేసుకుంటే 13మంది పేర్లు మాత్రమే లిస్టులో రావడమేంటని గ్రామస్తులు ప్రశ్నించారు. రేషన్‌కార్డులకు తాము అర్హులం కాదా అని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్లు కూడా ఇదివరకు ఇండ్లు ఉన్న వారినే ఎంపిక చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులందరికీ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

గంభీరావుపేట, జనవరి 21: పొన్నాలపల్లి, జగదాంబతండా, మల్లుపల్లి, రాజుపేట, కోళ్లమద్ది, లక్ష్మీపూర్‌లో గ్రామసభలు నిర్వహించారు. జాబితాలో పేర్లు రాకపోవడంతో పలు చోట్ల గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

గ్రామ సభలతో కొత్త డ్రామా: సిద్ధం వేణు

ఇల్లంతకుంట రూరల్, జనవరి 21: పోలీస్ పహారాలో గ్రామ సభలు జరగుతున్నాయంటే కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ఎలా ఉందో అర్థమవుతోందని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు విమర్శించారు. గ్రామ సభలతో కాంగ్రెస్ సర్కారు కొత్త డ్రామాకు తెరలేపిందని ఆయన మండిపడ్డారు. ఈ సభలు సామాన్యులకు ఒరగబెట్టేదేమీ లేదన్నారు. కాంగ్రెస్ నాయకులకే అన్ని పథకాలంటూ మండిపడ్డారు. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను కాదని.. లబ్ధిదారుల లిస్టు ప్రకటిస్తే బాగుండేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలను మభ్యపెట్టడానికే ఈ సర్వేలన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తేనే పథకాలు వస్తాయని, లేకపోతే రావని చెప్పే ఒక పెద్ద కుట్రకు తెరలేపే విధంగా ప్రభుత్వం నడుస్తున్నదని విమర్శించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు.

బతికుండగానే చంపేసిన్రు..

చందుర్తి, జనవరి 21: అధికారుల నిర్లక్ష్యం ఓ వృద్ధురాలిని బతికుండగానే చంపేసింది. చందుర్తి మండలం మూడపెల్లికి చెందిన వట్టిమల్ల సత్యవ్వకు కొన్నేళ్లుగా రేషన్ బియ్యం రావడం లేదు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన సభలో తన సమస్యను వివరించింది. ఐదేండ్ల క్రితం తన భర్త లస్మయ్య చనిపోగా.. అధికారులు రేషన్‌కార్డులో తన భర్తకు బదులు తానే మరణించినట్లు నమోదు చేయడంతో అప్పటి నుంచి రేషన్ సరుకు రావడం లేదని విలపించింది. తన భర్త పేరును తొలగించి.. తనకు రేషన్ సరుకులు వచ్చేలా చూడాలని కోరింది.

చందుర్తి: గ్రామ సభలో ఆవేదన వ్యక్తం చేస్తున్న వట్టిమల్ల సత్తవ్వ

కునుకే కరువాయే..

కునుకు తీస్తున్న ప్రత్యేక అధికారి రవీందర్‌రెడ్డి

చందుర్తి మండలం మూడపెల్లిలో లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి గ్రామసభ జరుగుతుండగా, ప్రత్యేకాధికారిగా విచ్చేసిన రవీందర్‌రెడ్డి కునుకులో విహరించారు. కాగా, గ్రామస్తులు అధికారికి కునుకే కరువాయే.. అంటూ చర్చించుకున్నారు. ఆయన తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

₹18వేల వేతనం అందించాలి

- కలెక్టరేట్ ఎదుట ఆశ కార్యకర్తల ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

కలెక్టరేట్, జనవరి 21: అసెంబ్లీలో సమావేశాల్లో తమకు ₹18వేల ఫిక్స్‌డ్ వేతనం అందేలా చూడాలని మంగళవారం సిరిసిల్లలోని కాలేజీ గ్రౌండ్ నుంచి కలెక్టరేట్ వరకు పెద్దఎత్తున ఆశ కార్యకర్తలు పాదయాత్ర చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం మెనిఫెస్టోలో ఆశ కార్యకర్తలకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీఇచ్చి అమలు చేయడం లేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

రాజన్న తలనీలాలకు ముందుకు రాని కాంట్రాక్టర్లు

వేములవాడ, జనవరి 21: రాజన్న ఆలయంలో 2025-27 సంవత్సరాలకు గానూ తలనీలాల సేకరణకు మంగళవారం నిర్వహించిన టెండర్‌కు ఒక్క కాంట్రాక్టర్ కూడా ముందుకురాలేదు. అయితే గత ఆర్థిక సంవత్సరానికి (2023-25) టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ స్వామివారికి నగదును చెల్లించకుండా ఇప్పటికే మొండికేశాడు. ఈ ఏడాది మార్చి నాటికి సదర్ కాంట్రాక్టర్ గడువు ముగుస్తుండగా, మూడు నెలల ముందే ఆలయంలో తలనీలాల సేకరణకు టెండర్ నిర్వహిస్తున్నారు. 21న టెండర్ నిర్వహిస్తున్నామని అధికారులు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రకటనలను చేయడంతోపాటు దాదాపు 40మంది కాంట్రాక్టర్లకు నేరుగా సమాచారం ఇచ్చారు. అయినప్పటికీ ఒకరు కూడా ముందుకు రాలేదు. ఆన్‌లైన్‌లో కూడా టెండర్లు ఎవరు దాఖలు చేయకపోవడంతో ఆలయ అధికారులు కంగుతిన్నారు. మరోసారి టెండర్ నిర్వహిస్తామని ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు.

పకడ్బందీగా లబ్ధిదారుల గుర్తింపు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- గండిలచ్చపేటలో గ్రామ సభకు హాజరు

గండిలచ్చపేట సభలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

రాజన్న సిరిసిల్ల, జనవరి 21 (నమస్తే తెలంగాణ)/సిరిసిల్ల రూరల్: ప్రభుత్వ పథకాల కోసం లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేటలో నిర్వహించిన గ్రామ సభకు ఆయన హాజరై మాట్లాడారు. 13 మండలాల్లో 75గ్రామాలు, సిరిసిల్ల మున్సిపల్‌లో ఎనిమిది, వేములవాడ మున్సిపల్ పరిధిలోని 8 వార్డుల్లో తొలిరోజు మంగళవారం ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు సభలు నిర్వహించినట్లు చెప్పారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని, ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. అలాగే తంగళ్లపల్లి మండల కేంద్రంతోపాటు చీర్లవంచ, పాపయ్యపల్లి, అంకిరెడ్డిపల్లి, జిల్లెల్ల, మల్లాపూర్, తాడూరులో గ్రామ సభలు జరిగాయి. కార్యక్రమంలో డీఆర్డీవో శేషాద్రి, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఉన్నత విద్యకు భరోసా

కలెక్టరేట్, జనవరి 21: బదిర విద్యార్థిని ఉన్నత విద్యాభ్యాసానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించింది. వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన దోమకొండ పోచయ్య కూతురు లహరి కరీంనగర్ జిల్లాలోని బధిరుల పాఠశాలలో పదో తరగతి వరకు చదివింది. ఉన్నత విద్యాభ్యాసం చేసేందుకు ఆర్థిక స్థోమత లేక ఇంటి వద్దే ఉంటున్నది. ఈ విషయం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా దృష్టికి వచ్చింది. దీంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థి వివరాలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించగా.. ప్రభుత్వం లక్షా40వేల ఆర్థిక సాయం సీఎంఆర్ఎఫ్ కింద పంపించింది. మంగళవారం లహరికి కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సదరు చెక్కు అందజేశారు. ఉన్నత విద్య నభ్యసించి అనుకున్న లక్ష్యం చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు లహరి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

ఇల్లంతకుంట, జనవరి 21: రహీంఖాన్‌పేటలోని ఆదర్శ పాఠశాల విద్యార్థిని జీ మైథిలి (తొమ్మిదో తరగతి) ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల జగిత్యాల జిల్లాలో జరిగిన క్రికెట్ పోటీలో మైథిలి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 22 నుంచి 24వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఎస్జీఎఫ్ సెక్రటరీ నర్ర శ్రీనివాస్‌రెడ్డి, పీఈటీ మామిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్రీడాకారులు పోటీలకు వెళ్లారు.

డబ్బు లొచ్చాయి.. ఖర్చులకివ్వండి

- వృద్ధ దంపతులకు టోకరా
- ఎల్లారెడ్డిపేటలో ఘటన

విలపిస్తున్న వృద్ధ దంపతులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 21: ఖర్చుల కోసం మీ బ్యాంకు ఖాతాలోకి డబ్బులు పంపినం.. అందుకు ఖర్చవుతుంది.. అని ఇద్దరు దుండగులు అక్కపల్లికి చెందిన వృద్ధ దంపతులను మోసం చేసిన ఘటన మంగళవారం ఎల్లారెడ్డిపేటలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. అక్కపల్లికి చెందిన సుంకరి పెద్ద మల్లయ్య-అమృత్వ దంపతులు మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లారు. పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలు వారి వద్ద ఆగారు. మేము మీ కోసమే మీ ఇంటికి వెళ్లాం.. మీ ఖాతాలో ఖర్చుల కోసం ₹50వేలు మా సార్ పంపుతున్నాడు.. అందుకోసం ₹3వేలు ఖర్చు అవుతుందని మాయమాటలు చెప్పారు. నిజమే అనుకుని అమృతవ్వ వారిని నమ్మి డబ్బు ఇవ్వగా, వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత జరిగింది మోసమని తెలియడంతో వారు బోరున విలపించారు.

కేటీఆర్‌ను కలిసిన నాయకులు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో నాయకులు

ముస్తాబాద్, జనవరి 22: జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యూత్ విభాగం ప్రధాన కార్యదర్శిగా నియామకమైన ముస్తాబాద్‌కు చెందిన శీలం స్వామి, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ మంగళవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని కేటీఆర్ అభినందించారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి

బహుమతులు అందజేస్తున్న డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి

తెలంగాణ చౌక్, జనవరి 21: విద్యార్థి దశ నుంచే లక్ష్య సాధనకు కృషి చేయాలని డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. గీతానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎల్టా ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్టు విజేతలకు మంగళవారం బహుమతులు అందజేసి, అభినందనలు తెలిపారు. ఇక్కడ ఎంఈవో రఘుపతి, జిల్లా అధ్యక్షుడు తిరుపతి, హెచ్ఎం మంజులరాణి, సభ్యులు ఉన్నారు.

మహాసభలు విజయవంతం చేయాలి

వేములవాడ, జనవరి 21: ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర రెండో మహాసభలను విజయవంతం చేయాలని ఏటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. జగిత్యాల జిల్లా కోరుట్లలో ఈ నెల 30, 31 తేదీల్లో జరిగే మహాసభకు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. ఇక్కడ బీడీ కార్మిక సంఘం అధ్యక్షురాలు కేవీ అనసూర్య, ఏటీసీ జిల్లా నేతలు ఎల్ల దేవరాజు, గాజుల పోశెట్టి, గంగవ్వ, పుష్పలత, రస్మిక, సుల్తానా, సోఫియా ఉన్నారు.

క్రీడా సామగ్రి, సీసీ కెమెరాల అందజేత

ఇల్లంతకుంట, జనవరి 21: దాచారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పెద్దలింగాపూర్‌కు గ్రీన్ కో ఫౌండేషన్ సభ్యులు మంగళవారం క్రీడా సామగ్రి, సీసీ కెమెరాలను హెచ్ఎం రాణికి